
సాక్షి గుంటూరు

బుధవారం, 23, అక్టోబర్, 2024



3న గ్యార్మీ, గంధ మహోత్సవం

భట్టిప్రోలు: హజరత్ మహబూబ్ సుభానీ 13వ గ్యార్మీ, గంధ మహోత్సవం నవంబర్ 3న భట్టిప్రోలు మండలం వేమవరంలో జరుగుతుందని మహబూబ్ సుభానీ మంగళవారం తెలిపారు.



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 21,490 క్యూసెక్కులు వచ్చి చేరుతుంది. దిగువకు 16,000 క్యూసెక్కులు వదులుతున్నారు.



డివైడర్ ఎక్కిన బస్సు

నాదెండ్ల: అద్దంకి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు విజయవాడ నుంచి చిలకలూరిపేట వైపు వెళుతూ గణపవరం వద్దకు రాగానే బ్రేక్ ఫెయిల్ కావటంతో డివైడర్ ఎక్కింది.

న్యూస్‌రీల్

ఏఎన్‌యూకు రానున్న ఎన్‌ఐఆర్‌ఎఫ్ నిపుణుల బృందం



ఏఎన్‌యూ: ఎన్‌ఐఆర్‌ఎఫ్ (ద నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్) నిపుణుల బృందం ఈ నెల 25, 26వ తేదీల్లో ఆచార్య నాగార్జున యూనివర్సిటీని సందర్శించనుందని రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం తెలిపారు. ఆ రెండు రోజుల్లో యూనివర్సిటీలోని అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి ఏ విధమైన సెలవులు మంజూరు చేయబోమన్నారు. అత్యవసర పరిస్థితుల్లో సెలవులు పెట్టుకోవాల్సిన వారు సంబంధిత అధికారుల నుంచి ముందుగా అనుమతి తీసుకోవాలని సూచించారు.

29 నుంచి సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల క్రీడా పోటీలు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): ఈ నెల 29, 30వ తేదీల్లో జిల్లా స్థాయి మెన్ అండ్ ఉమెన్ సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల క్రీడా పోటీలు స్థానిక బీఆర్ స్టేడియంలో నిర్వహించనున్నారు. ఈ మేరకు డీఎస్‌డీఓ పి.నరసింహారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిభకనబరచిన వారిని ఎంపిక చేసి వచ్చే నెల 6 నుంచి 9వ తేదీ వరకు జరగనున్న రాష్ట్ర పోటీలకు పంపిస్తామన్నారు. పోటీల్లో పాల్గొనే ఉద్యోగులు సంబంధిత డిపార్ట్‌మెంట్ ఐడీ ప్రూఫ్‌తో రావాలన్నారు. వివరాలకు 94418 18491 ఫోను నెంబర్‌కు సంప్రదించాలని తెలిపారు.

పలు రైళ్లు రద్దు



లక్ష్మీపురం: సౌత్‌సెంట్రల్ రైల్వే గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో దానా తుపాన్ కారణంగా డివిజన్ మీదుగా పలు రైళ్లను రద్దు చేశారు. డివిజన్ సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్ మంగళవారం ఈ విషయం తెలిపారు. నెంబర్ 17016 సికింద్రాబాద్-భువనేశ్వర్ 23వ తేదీన, 12703 హౌరా- సికింద్రాబాద్, 18047 షాలిమార్-వాస్కో రైలు 24న, 12514 షాలిమార్-వాస్కో, 18464 బెంగళూరు-భువనేశ్వర్, 12704 సికింద్రాబాద్-హౌరా 23న, 03429 సికింద్రాబాద్-మాల్దా టౌన్ 24న, 12513 సికింద్రాబాద్-సాలీచర్ రైలు 26న, 17015 భువనేశ్వర్-సికింద్రాబాద్, 18463 భువనేశ్వర్-బెంగళూరు సిటీ రైలు 25వ తేదీన రద్దు అయ్యాయి.

యార్డుకు 30,429 బస్తాల మిర్చి



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 30,429 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 28,133 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ. 16,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి రూ.18,600 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ.8,500 నుంచి రూ. 16,000 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 8,500 నుంచి రూ. 18,500 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.11,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 24,612 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

బాలిక కిడ్నాప్

కేసు నమోదు చేసిన వన్‌టౌన్ పోలీసులు

నరసరావుపేటటౌన్: ప్రేమ పేరుతో బాలికకు మాయమాటలు చెప్పి బలవంతంగా కిడ్నాప్ చేసిన యువకుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ విజయ్‌చరణ్ మంగళవారం తెలిపారు. పట్టణానికి చెందిన 16 ఏళ్ల బాలిక ఆర్కెస్ట్రాలో డ్యాన్సర్‌గా పనిచేస్తోంది. అక్కడ ఆమెకు వినుకొండ మన్నేపల్లి తండాకు చెందిన వెంకటేష్‌తో పరిచయం ఏర్పడింది. కొన్ని నెలలుగా ప్రేమ పేరుతో ఆమెను వేధిస్తున్నాడు. విషయం తెలుసుకున్న ఆమె కుటుంబ సభ్యులు యువకుడిని మందలించారు. సోమవారం బాలిక ఇంటికి వచ్చి బలవంతంగా ఆమెను వినుకొండకు తీసుకెళ్లాడు. ఈ మేరకు బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



ఎగిరిపోయేలా..!

డ్రోన్... ఒకప్పుడు ఫొటోలు, వీడియో తీయడానికి వినియోగించిన వీటిని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందు చూపుతో సాగు రంగంలోకి తెచ్చారు. పరిశోధనల దిశగా ఆయన నిర్దేశం చేశారు. ఎరువులు, పురుగు మందులు చల్లడానికి, వెద సాగుకు డ్రోన్ ఉపయోగించేలా చొరవ తీసుకున్నారు. ఆచార్య రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం నాటి ప్రభుత్వ సహకారంతో ఎన్నో నూతన అంశాలకు శ్రీకారం చుట్టింది. డీజీసీఏ అనుమతితో 950 మంది డ్రోన్ పైలట్లుగా శిక్షణ పూర్తి చేసుకున్నారు.

- సాగు రంగంలో 'డ్రోన్ల'కు పెద్దపీట
- వైఎస్సార్ సీపీ హయాంలోనే అడుగులు
- నాటి సీఎం వైఎస్ జగన్ ముందుచూపు
- ఇప్పటికే 950 మందికి డ్రోన్ పైలెట్లుగా శిక్షణ

సాక్షి ప్రతినిధి, గుంటూరు: రాష్ట్రంలో డ్రోన్‌లను ఉపయోగించడానికి, వాటిపై విశేష పరిశోధనలు జరగడానికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం దోహదం చేసింది. డ్రోన్ టెక్నాలజీని వ్యవసాయ రంగంతోపాటు సైనిక అవసరాలు, ఫుడ్ డెలివరీకి కూడా ఉపయోగిస్తున్నారు. గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీసర్వేకి కూడా డ్రోన్ టెక్నాలజీని ఉపయోగించి మంచి ఫలితాలు సాధించిన సంగతి తెలిసిందే. పెరిగిన ఖర్చులతో నష్టపోతున్న రైతన్నకు ఊరట కల్పించడమే కాకుండా యువతరాన్ని ఈ రంగం వైపు మళ్లించడానికి ఈ డ్రోన్ టెక్నాలజీని గత ప్రభుత్వం అభివృద్ధి చేసింది. వ్యవసాయ రంగంలో వినియోగించడంతోపాటు డ్రోన్ పైలెట్లను తయారు చేసే బాధ్యతను ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి అప్పగించింది. 2018లోనే డ్రోన్ టెక్నాలజీ అభివృద్ధికి యూనివర్సిటీ శ్రీకారం చుట్టినా, 2019 వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత అందించిన ప్రోత్సాహంతో గణనీయంగా దీనిని అభివృద్ధి చేసింది. డ్రోన్ టెక్నాలజీని ఎరువులు, పురుగు మందులు జల్లడానికి, విత్తనాలు వెద పద్ధతిలో జల్లడానికి ఉపయోగిస్తున్నారు. ఆధునిక పద్ధతులను జోడించడం ద్వారా వెద పద్ధతిని, సస్యరక్షణలో మందుల వినియోగానికి డ్రోన్ టెక్నాలజీ ఉపయోగిస్తున్నారు.

950 మందికి శిక్షణ పూర్తి

దేశంలోనే ఎక్కడా లేని విధంగా డ్రోన్‌లను వినియోగించడంతోపాటు పైలెట్లను ఆచార్య ఎన్‌జీ రంగా యూనివర్సిటీ శిక్షణ ఇస్తోంది. ఇప్పటి వరకూ 850 మందికి పైలెట్లుగా గ్రామీణ యువత, రైతులకు శిక్షణ ఇచ్చింది. వారికి సర్టిఫికెట్లు కూడా జారీ చేశారు. మరో వంద మంది పాలిటెక్నిక్ విద్యార్థులకు కూడా ఇక్కడ శిక్షణ ఇచ్చారు. ఇప్పటికే ప్రధాన పంటలైన వరి, చెరకు, మినుము, పెసర, పత్తి, మిరప, జొన్న, మొక్కజొన్న, శనగ, వేరుశనగ లాంటి పంటల్లో డ్రోన్‌లతో సస్యరక్షణ చర్యలు చేపడుతున్నారు. యూనివర్సిటీలలో కృత్రిమ మేధపై దృష్టి పెట్టాలని వర్సిటీల సమావేశంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు నేపథ్యంలో పూర్తిస్థాయిలో కృత్రిమ మేధను వ్యవసాయ రంగంలోకి తీసుకు వచ్చేందుకు అంగ్రూ నడుం బిగించింది. ఇప్పటికే ఈ రంగంలో కొంతమేర ప్రయోగాలు మొదలు పెట్టింది. నూతన సంప్రదాయ వ్యవసాయ పద్ధతుల మధ్య సులువుగా, ఖర్చు తగ్గించేలా వ్యవసాయ రంగంలో విప్లవాత్మక పెనుమార్పులు తీసుకురావడానికి కృషి చేసింది. 2020 నుంచి విస్తృత పరిశోధనలు జరిపి దేశంలోనే అత్యాధునికమైన ఏరియల్ రోబోటైజ్ డ్రోన్లను తీసుకువచ్చింది. ప్రస్తుతం రాష్ట్రంలో నాలుగు లక్షల ఎకరాల్లో ఈ డ్రోన్ల వినియోగిస్తున్నారు. అటు దేశానికి దిశా నిర్దేశం చేస్తూ కచ్చిత వ్యవసాయం వైపు రైతులను నడిపిస్తోంది. తాజాగా బుడమేరు వరదల్లో కూడా అంగ్రూ వ్యవసాయ డ్రోన్లను మార్చి ఉపయోగించారు.



కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అనుచరుడు, రౌడీషీటర్ రాగి నవీన్ చేతిలో గాయపడిన సహానా మంగళవారం రాత్రి గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. మూడు రోజుల కిందట నవీన్ తన పుట్టిన రోజు అని చెప్పి సహానాను తీసుకువెళ్లి ఆమెపై దాడి చేసిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న సహానా ఆరోగ్యం క్షీణించడంతో మంగళవారం రాత్రి మృతి చెందింది. అంతకు ముందు వైఎస్సార్‌సీపీ గుంటూరు, నరసరావుపేట పార్లమెంటు నియోజకవర్గాల పరిశీలకులు మోదుగుల వేణుగోపాలరెడ్డి పెద్దాసుపత్రికి వెళ్లి సహానా పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.ఆయన వెంట పార్టీ నగర అధ్యక్షుడు వనమా బాలవజ్రబాబు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త నూరిఫాతిమా తదితరులు ఉన్నారు. ఆ తరువాత సహానా మృతి చెందినట్టు తెలియడంతో మాజీ మంత్రులు మేరుగ నాగార్జున, విడదల రజిని, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, మేయర్ కావటి మనోహర్ నాయుడు తదితరులు ఆసుపత్రికి చేరుకుని ప్రభుత్వ వైఖరిపై ధ్వజమెత్తారు.. ఇది ప్రభుత్వ హత్యేనని తేల్చి చెప్పారు. యువతి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

- గుంటూరు మెడికల్





డాలర్ డ్రీమ్స్ వదిలి..

ఆత్మసంతృప్తికి కదిలి...

- అధ్యాపక వృత్తిలోకి విద్యాధికుడు
- డిగ్రీ కళాశాలకు సాంకేతిక హంగులు
- వర్చువల్ ఇంటర్న్‌షిప్, సర్టిఫికేషన్ కోర్సులు
- గ్రామీణ ప్రాంత విద్యార్థులకు చేయూత
- ఏటా వందల మందికి ఉద్యోగాలు
- సేవలకు వరించిన జాతీయ అవార్డులు

ప్రపంచంలోని టాప్ టెన్ ఆర్థిక సంస్థల్లో ఒకటైన మోర్గాన్‌స్టాన్లీలో సీనియర్ సిస్టం ప్రోగ్రామర్ ఉద్యోగం... రూ.లక్షలలో ఆకర్షణీయమైన వేతనం. ఆ ఉద్యోగం వద్దనుకుని స్వదేశంలోని సాధారణ ప్రైవేట్ కళాశాలలో అధ్యాపకుడిగా కొత్త జీవితం ప్రారంభించారాయన. తన కృషితో విద్యార్థులకు డిజిటల్ నాలెడ్జిని పరిచయం చేశారు. ఇంటర్న్‌షిప్‌లు, ఆన్‌లైన్ సర్టిఫికేషన్ కోర్సులను తప్పనిసరి చేశారు. దీంతో క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఏటా వందల మంది విద్యార్థులు ఉద్యోగాలను సాధిస్తున్నారు. ఆయన కృషికి జాతీయస్థాయి అవార్డులు కూడా వరించాయి. **ఆయనే డాక్టర్ కొలసాని రామ్‌చంద్.**

తెనాలి: తెనాలి సమీపంలోని ఈపూరు గ్రామం డాక్టర్ రామ్‌చంద్ సొంతూరు. తల్లిదండ్రులు హనుమంతరావు, సీతారామమ్మ. గుల్బర్గా యూనివర్సిటీలో బీటెక్ కాగానే గుంటూరులోని ప్రైవేటు కాలేజీలో ఆయన అధ్యాపకుడిగా చేరారు. బిట్స్ పిలానీలో ఎంఎస్, ఎంజీఆర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో ఎంటెక్, 'ఆచార్య నాగార్జున'లో 'కంప్యూటర్ సైన్స్‌లో సాఫ్ట్‌వేర్ విశ్వసనీయత'పై 2011లో పీహెచ్‌డీ చేశారు. 1997లో అమెరికాలో మోర్గాన్‌స్టాన్లీ కంపెనీలో సీనియర్ సిస్టమ్ ప్రోగ్రామర్‌గా జాయినయ్యారు. రూ.లక్షల్లో జీతం, హోదా బాగున్నా ఉద్యోగ సంతృప్తి లేకుండాపోయింది. అధ్యాపక వృత్తిలో సంతృప్తి ముందు ఆ వేతనం దిగదుడుపు అనిపించింది. తల్లిదండ్రులు అభ్యంతర పెట్టినా వినకుండా తెనాలి వచ్చేశారు. స్థానిక ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజీలో అధ్యాపకుడిగా తనకిష్టమైన జీవితాన్ని ఆరంభించారు. కంప్యూటర్ విభాగం హెచ్‌ఓడీగా, పీజీ డైరెక్టర్‌గా, విమెన్స్ ఇంజినీరింగ్ కాలేజీ వైస్ ప్రిన్సిపల్‌గా బాధ్యతలు చేపట్టారు. 2016 నుంచి డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని తగిన శిక్షణను డిజైన్ చేశారు. ఏటా అప్‌డేట్ చేసుకుంటూ అమలు చేయసాగారు. అచిరకాలంలోనే విప్రో, ఇన్ఫోసిస్, టీసీఎస్ వంటి సంస్థలు క్యాంపస్ ఇంటర్వ్యూలకు రాసాగాయి.

నాన్ ఐటీ రంగాలపై దృష్టి

కరోనాతో వర్చువల్ విధానం తప్పనిసరైంది. కంపెనీల రిక్రూట్‌మెంట్‌కూ ఇదే ప్రాతిపదికైంది. దీనితో శిక్షణ, సాధన, సర్టిఫికేషన్స్‌కు ఇదే విధానం అవలంబించసాగారు. సాఫ్ట్‌వేర్ ఒడిదుడుకులను గమనంలోకి తీసుకుని మార్కెటింగ్, బ్యాంకింగ్, ఫైనాన్స్, బీమా, ఇంగ్లిష్ టీచింగ్ వంటి నాన్ ఐటీ రంగాల్లోనూ అనుగుణమైన శిక్షణను ఆరంభించారు. యాక్సిస్ బ్యాంక్, ఐఎల్ఎం, పిరామిల్ ఫైనాన్స్, సదర్లాండ్ వంటి సంస్థలు కాలేజీని రిక్రూట్‌మెంట్ కేంద్రంగా ఎంచుకున్నాయి. మొత్తం మీద డిగ్రీ కాలేజీ నుంచి ఐటీ, నాన్ ఐటీ రంగాల్లో ఏటా 700-1,200 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికవుతున్నారు.



'జ్యేష్ఠ ఆచార్య' అవార్డును వీసీ సయ్యద్ ఐనుల్ హసన్ నుంచి స్వీకరిస్తున్న రామ్‌చంద్ (ఫైల్)

అందుబాటులో ఆధునిక కోర్సులు

ఇంజినీరింగ్ కాలేజీల తరహాలో డిజిటల్ టెక్నాలజీని పెంచుతూ వర్చువల్ మోడ్‌తో తరగతుల నిర్వహణ, ఇంటరాక్షన్ వంటివి ఇక్కడ మరో ప్రత్యేకత! రాష్ట్రంలో జూమ్ పెయిడ్ ఉన్న ఏకైక డిగ్రీ కాలేజీ తమదని డాక్టర్ రామ్‌చంద్ వెల్లడించారు. కొన్ని కంపెనీలు గంటల వ్యవధిలోనే ఇంటర్వ్యూలను ప్రకటించటంతో విద్యార్థులను సన్నద్ధం కోసం జూమ్ ఇంటరాక్షన్స్ ఉపకరిస్తున్నాయని చెప్పారు. ఇంజినీరింగ్‌కే పరిమితమైన ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్స్, ఈ-కామర్స్, డిజిటల్ మార్కెటింగ్‌లో సర్టిఫికెట్ కోర్సులను తప్పనిసరి చేశారు. ఇంటర్న్‌షిప్‌లు చేయిస్తున్నారు. కంపెనీలకు కాలేజీ యాజమాన్యం డబ్బును చెల్లిస్తూ, విద్యార్థులకు ఉచితంగా అవకాశం కల్పిస్తోంది. వీటిలోనే రెండుసార్లు కాలేజీకి జాతీయస్థాయి అవార్డులు వరించాయి. విద్యార్థుల్లో వాయిదా వేసే అలవాటును మార్చేందుకు రోజుకు 15 గంటల చొప్పున వారానికి 105 గంటల చాలెంజ్, తర్వాత 21 గంటల చాలెంజ్ వంటి ప్రణాళికలను అమలు చేస్తుండటం మరో ప్రత్యేకత. వందలాది విద్యార్థులు ఈ సవాలును స్వీకరించారు. ఇంటరాక్షన్, సందేహాల కోసం తాను కూడా అన్ని గంటలు వర్చువల్‌గా అందుబాటులో ఉంటూ నిరంతరం శ్రమిస్తున్నారు డాక్టర్ రామ్‌చంద్.

అందరి సహకారంతో విజయం

డిగ్రీ సిలబస్ ఫండమెంటల్‌గానే ఉంటున్నా, కంపెనీల అవసరాలు 'హై ఎండ్'గా ఉంటున్నాయి. ఫలితంగానే విద్యార్థుల్ని ఇంతగా తీర్చిదిద్దుతున్నాం. వారికే ఏ ఉద్యోగం కావాలో ఎంచుకుంటున్నారు. పూర్తి ఆత్మవిశ్వాసంతో వెళుతున్నారు. డాక్టర్ రామ్‌చంద్. కాలేజీ యాజమాన్యం ఇస్తున్న బాధ్యతాయుతమైన అధికారం, సహకారం ఎంతగానో తోడ్పడుతోందని చెప్పారు.

ఎన్నో గుర్తింపులు

స్థానిక ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్. ఎడ్యుస్కిల్స్ - ఏఐసీటీఈ - జాతీయ ఇంటర్న్‌షిప్ పోర్టల్ 2023-2024 కాలానికి వర్చ్యువల్ ఇంటర్న్‌షిప్‌లో కాలేజీకి ఇటీవలే జాతీయస్థాయిలో మూడో ర్యాంక్ లభించింది. సౌత్, సెంట్రల్ జోన్స్‌లో 'బెస్ట్ పెర్ఫార్మింగ్ డిగ్రీ కాలేజీ', డిగ్రీ కళాశాలల విభాగంలో 'ప్రిన్సిపల్ ఎక్స్‌లెన్స్ అవార్డు'లతోపాటు ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్, వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లోనూ స్థానం లభించింది. ఇంతకుముందు ఏఐసీటీఈ అనుమతి పొందిన 'బ్రెయిన్ విజన్'చే జాతీయ స్థాయిలో 'జ్యేష్ఠ ఆచార్య' అవార్డునూ ప్రిన్సిపల్ డాక్టర్ రామ్‌చంద్ స్వీకరించారు. అవార్డును మౌలానా అజాద్ నేషనల్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ నుంచి అందుకున్నారు.

తక్కువ ఖర్చుతో నిర్మించిన

గృహాలు భేష్



మహిళతో మాట్లాడుతున్న గవా ప్రసాద్

వరగాని(కాకుమాను): తక్కువ ఖర్చుతో నిర్మించిన గృహాలు బాగున్నాయని కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ డిప్యూటీ డైరెక్టర్ గవా ప్రసాద్ అన్నారు. పెదనందిపాడు మండలంలోని వరగాని గ్రామంలో మంగళవారం సాయంత్రం ప్రధానమంత్రి ఆవాస్ యోజన ద్వారా నిర్మించిన గృహాలను ఆయనతోపాటు ఐదు రాష్ట్రాల బృంద సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ.రెండు లక్షల యూనిట్ ఖర్చుతో అన్ని సౌకర్యాలతో గృహాలు నిర్మించినట్లు తెలిపారు. మిగిలిన వాటిని పూర్తి చేసేలా కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఎస్సీ కాలనీలోని మాణిక్యమ్మ అనే మహిళ.. తనకు ఇల్లు మంజూరైనా ఇప్పటి వరకు బిల్లులను చెల్లించకపోవడంతో పనులు నిలిచిపోయాయని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో మంత్రిత్వ శాఖ కార్యదర్శి శైలేష్ కుమార్ సింగ్, రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ పి.రాజాబాబు, చీఫ్ ఇంజినీర్ జి.వి.ప్రసాద్, గ్రామీణాభివృద్ధి శాఖ డిప్యూటీ డైరెక్టర్ చాహద్, హౌసింగ్ శాఖ ఎస్ఈ జయరాం చారి, పీడీ ప్రసాద్, ఈఈఏ శంకరరావు, తెలంగాణ హౌసింగ్ శాఖ ఎస్ఈ చైతన్య కుమార్, అధికారులు పాల్గొన్నారు.

- గుంటూరు జీజీహెచ్‌లో నిలిచిన కాక్లియర్ సర్జరీలు
- పరికరాలు లేవంటున్న ఈఎన్‌టీ విభాగ వైద్యులు
- బకాయిలు చెల్లించకపోవడంతో నిలిచిన ఇంప్లాంట్‌ల సరఫరా
- ఉన్నతాధికారులు చొరవ చూపించాలని బాధితుల వినతి

చెవికెక్కించుకోండి...!



జీజీహెచ్‌లో కాక్లియర్ స్క్రీనింగ్ పరీక్షలు చేస్తున్న ఈఎన్‌టీ వైద్యులు (ఫైల్)

గుంటూరు మెడికల్ : గుంటూరు జీజీహెచ్‌లో గత ప్రభుత్వం హయాంలో ఉచితంగా కాక్లియర్ స్క్రీనింగ్ పరీక్షలు చేసి, అవసరమైన వారికి సుమారు రూ.16 లక్షల ఖరీదైన ఆపరేషన్లు కూడా ఉచితంగా చేశారు. కొంతకాలంగా ఈ ఆపరేషన్లకు గ్రహణం పట్టింది. ఆస్పత్రి వైద్యులు, అధికారులు సైతం చొరవ చూపకపోవడంతో చిన్నారులు ఇబ్బంది పడుతున్నారు. బాధిత పిల్లల తల్లిదండ్రుల విన్నపాలను వారు చెవికెక్కించుకోవడం లేదు. ప్రైవేటు ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా ఆపరేషన్ చేస్తున్నప్పటికీ స్పీచ్ థెరఫీ, ఇతర వైద్య పరీక్షల నిమిత్తం కొంత డబ్బులు వసూలు చేస్తున్నారు. ఆ డబ్బులు చెల్లించలేని పేదలు జీజీహెచ్‌లో ఆపరేషన్‌లు ఎప్పుడు ప్రారంభిస్తారోనని ఎదురు చూస్తున్నారు.

సాహి సంస్థ సహకారం...

దక్షిణ భారత్‌లో మొట్ట మొదటిసారిగా కాక్లియర్ ఆపరేషన్లు చేసిన సీనియర్ ఈఎన్‌టీ సర్జన్ డాక్టర్ ఇ.సి. వినయ్‌కుమార్ తన స్వచ్ఛంద సంస్థ సాహి ద్వారా గుంటూరు జీజీహెచ్‌లో ఉచితంగా సేవలు అందించారు. పలు కాక్లియర్ ఆపరేషన్లు గత ప్రభుత్వం హయాంలో చేశారు. సుమారు రూ.50 లక్షల ఖరీదు చేసే వైద్య పరికరాలను సైతం సాహి సంస్థ చైర్మన్ జీజీహెచ్‌కు అందజేశారు. కాక్లియర్ ఆపరేషన్‌కు ఒక చెవికి సుమారు రూ.8 లక్షల వరకు అవుతుంది. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి మొట్టమొదటిసారిగా ఒక చెవికి ఆరోగ్యశ్రీ పథకంలో ఆపరేషన్‌కు అవకాశం కల్పించారు. ఆయన తనయుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలోనే మొట్టమొదటిసారిగా ఏపీలో రెండు చెవులకు ఉచితంగా ఆపరేషన్లు చేసేలా మార్పులు చేశారు. గత ప్రభుత్వంలో 15 మంది చిన్నారులకు గుంటూరు జీజీహెచ్‌లో ఉచితంగా కాక్లియర్ ఆపరేషన్లు చేశారు. అవసరమైన ఇంప్లాంట్లు సరఫరా చేసే కాంట్రాక్టర్లకు ఆసుపత్రి అధికారులు నిధులు చెల్లించలేదని తెలిసింది. దీంతో ఆ కాంట్రాక్టర్ సరఫరా నిలిపివేయడంతో ఆపరేషన్లు ఆగిపోయాయి. ఆపరేషన్ సౌకర్యం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రుల్లో కేవలం గుంటూరు జీజీహెచ్‌లోనే ఉంది. ప్రైవేటు ఆసుపత్రుల్లో కూడా కేవలం రెండు ఆసుపత్రుల్లోనే ఆరోగ్యశ్రీ ద్వారా చేస్తున్నారు. ఆపరేషన్‌కు ముందు, అనంతరం అవసరమయ్యే పరీక్షలు, స్పీచ్ థెరఫీకి డబ్బులు వసూలు చేస్తున్నారు. దీంతో ప్రతి నెలా ఐదు నుంచి పది మంది చిన్నారులు జీజీహెచ్‌కు వచ్చి నిరాశగా వెనుదిరుగుతున్నారు. జీజీహెచ్ వైద్యులు ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి ఆపరేషన్లు చేస్తున్నారు. ఇక్కడే చేస్తే అధిక మొత్తంలో ఆరోగ్యశ్రీ ద్వారా ఆసుపత్రికి ఆదాయం కూడా ఉంటుంది.

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం

కాక్లియర్ ఆపరేషన్లు చేసేందుకు కొన్ని రకాల వైద్య పరికరాలు కావాలని ఆసుపత్రి అధికారులను అడిగినట్లు ఈఎన్‌టీ వైద్య విభాగాధిపతి డాక్టర్ సుధీర్‌బాబు తెలిపారు. ఇంప్లాంట్ల సరఫరా నిలిచిపోయిందని చెప్పారు. కావాల్సిన వైద్య పరికరాలు సమకూరిస్తే ఆపరేషన్లు చేస్తామని వెల్లడించారు.

వాణిజ్యం
నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో మంగళవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. **3,000** గరిష్ఠం : రూ. **4,600**

మోడల్ ధర రూ. **3,800**

క్లుప్తంగా

బాధితురాలి కుటుంబానికి అండగా ప్రభుత్వం



గుంటూరు మెడికల్: తెనాలి పట్టణంలో యువకుడి దాడిలో తీవ్రంగా గాయపడి గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న సుహానాను మంగళవారం టీడీపీ నాయకులు ఆలపాటి రాజా, ఎమ్మెల్యే నక్కా ఆనంద్ బాబు పరామర్శించారు. అనంతరం మీడియాతో నక్కా ఆనంద్ బాబు మాట్లాడుతూ.. బాధితురాలి కుటుంబానికి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. ప్రతిపక్ష నాయకులు రాజకీయ లబ్ధి కోసం ఈ ఘటనను వాడుకుంటున్నారని ఆరోపించారు. ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం బాధితుల పక్షాన నిలిచి ఎంతవరకైనా పోరాడుతుందని తెలిపారు. శాంతిభద్రతలను కాపాడేందుకు ముందుంటుందని పేర్కొన్నారు. దోషులకు శిక్ష పడేవరకు ప్రభుత్వం ఊరుకోదన్నారు. గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ మాట్లాడుతూ.. సహానా ఆరోగ్య పరిస్థితి క్రిటికల్‌గా ఉందని, పేషెంట్‌ను వెంటిలేటర్‌పై ఉంచామని వెల్లడించారు.

అర్చక పరీక్షల దరఖాస్తుకు 31 వరకు గడువు

నగరంపాలెం: దేవదాయ, ధర్మాదాయ శాఖ నిర్వహించే ప్రవేశ, వర, ప్రవర ఆగమ అర్చక పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 31వ తేదీ వరకు గడువు పెంచారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ అర్చక ఐక్య వేదిక (అర్చక జేఏసీ) రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జంధ్యాల వెంకటరామలింగేశ్వరశాస్త్రి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల జరిగిన గ్రీవెన్స్ సెల్‌లో దరఖాస్తు చేసుకునేందుకు గత నెల 20వ తేదీతో గడువు ముగిసిందని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అనేక మంది దరఖాస్తు చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నారని తెలియజేయగా, గడువు పెంచారని తెలిపారు.

రౌడీషీటర్ల కార్యకలాపాలను అణచివేయాలి: ఐజీ



మాట్లాడుతున్న రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి

నగరంపాలెం: గుంటూరు రేంజ్ పరిధిలోని రౌడీషీటర్ల కార్యకలాపాలను పూర్తిగా అణచివేయాలని రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠత్రిపాఠి అన్నారు. గుంటూరు కలెక్టర్ బంగ్లా రోడ్‌లోని రేంజ్ ఐజీ కార్యాలయంలో మంగళవారం జిల్లాల ఎస్పీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. లా అండ్ ఆర్డర్, తీవ్రమైన నేరాలకు సంబంధించి కేసులపై ఆరా తీశారు. రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠతిపాఠి మాట్లాడుతూ.. రౌడీషీటర్లపై నిరంతరం నిఘా ఉంచాలని అన్నారు. జిల్లాల్లోని అన్ని ముఖ్య ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, వాటి పనితీరు నిత్యం సమీక్షించాలని చెప్పారు. కేసుల దర్యాప్తులలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించాలని సూచించారు. కమ్యూనిటీ ఫ్రెండ్లీ పోలీసింగ్ ద్వారా ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహించాలని ఆదేశించారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫాం ద్వారా తప్పుడు ప్రచారాలు చేసే వారిని నియంత్రించాలని చెప్పారు. సైబర్ నేరాలు తగ్గించాలని సూచించారు. ఎస్పీలు సతీష్‌కుమార్ (గుంటూరు), శ్రీనివాసరావు (పల్నాడు), తుషార్‌డూడీ (బాపట్ల), దామోదర్ (ప్రకాశం), కృష్ణకాంత్ (ఎస్పీఎస్ నెల్లూరు జిల్లా) పాల్గొన్నారు.

ఎఫ్‌ఎల్‌ఎన్ శిక్షణతో నాణ్యమైన విద్య



మాట్లాడుతున్న డి.లింగేశ్వర రెడ్డి

తాడికొండ: విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఎఫ్‌ఎల్‌ఎన్ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ డి.లింగేశ్వర రెడ్డి అన్నారు. తుళ్ళూరు మండలం పెదపరిమిలోని ముప్పా చిన బాపిరెడ్డి చారిటబుల్ ట్రస్టులో మంగళవారం గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాలకు చెందిన ఎస్‌జీటీలకు ఎఫ్‌ఎల్‌ఎన్ శిక్షణ తరగతులు ప్రారంభం అయ్యాయి. దీనికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. శిక్షణ ద్వారా నేర్చుకున్న అంశాలను విద్యార్థులకు బోధించి వారిలోని నైపుణ్యాలను వెలికితీయాలని సూచించారు. కార్యక్రమాన్ని జిల్లా డీఈవో పి. శైలజ సందర్శించారు. డీఆర్‌పీ, ఎస్‌జీటీలకు పలు సూచనలు అందజేశారు. ఎస్ఏఎల్‌టీ ప్రోగ్రాం డైరెక్టర్ సురేష్, ప్రధాన్ కంటెంటెంట్ లీలా పద్మ ఆకస్మికంగా సందర్శించారు. ఈ కార్యక్రమంలో డైట్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్కే సలీం బాషా, సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి



విద్యాశాఖాధికారులతో సమావేశమైన హెనీ క్రిస్టినా, సీఈవో జ్యోతిబసు తదితరులు

- స్టడీ మెటీరియల్ సిద్ధం చేయండి
- జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా

గుంటూరు ఎడ్యుకేషన్: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా పేర్కొన్నారు. మంగళవారం జెడ్పీ కార్యాలయంలోని చైర్‌పర్సన్ చాంబర్‌లో జెడ్పీ సీఈవో వి.జ్యోతిబసు అధ్యక్షతన గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల విద్యాశాఖాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కత్తెర హెనీ క్రిస్టినా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో టెన్త్ విద్యార్థులు అత్యధిక ఉత్తీర్ణత సాధించే విధంగా ప్రోత్సహిస్తూ ప్రతి యేటా జెడ్పీ పాలకవర్గ ఆధ్వర్యంలో సబ్జెక్టు నిపుణులతో రూపొందించిన ప్రత్యేక స్టడీ మెటీరియల్‌ను ముద్రించి ఉచితంగా పంపిణీ చేస్తున్నామని చెప్పారు. రెండేళ్లుగా పంపిణీ చేసిన స్టడీ మెటీరియల్ విద్యార్థులకు అధిక మార్కుల సాధనకు ప్రయోజనం చేకూర్చిందని వరుసగా మూడో ఏడాది స్టడీ మెటీరియల్ పంపిణీకి చర్యలు చేపడుతున్నామన్నారు. విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్‌ను డిసెంబర్ 10లోపు విద్యార్థులకు అందించేలా ప్రణాళికలను రూపొందించాలని విద్యాశాఖాధికారులను ఆదేశించారు. నూరు శాతం ఉత్తీర్ణతకు దోహదం చేసే విధంగా ఉండటంతోపాటు జిల్లాలోని నిష్ణాతులైన ఉపాధ్యాయులచే రూపొందించాలని సూచించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో టెన్త్ చదువుతున్న 34,573 మంది విద్యార్థులకు స్టడీ మెటీరియల్ ఉందని ఆయా జిల్లాల డీఈవోలు చైర్‌పర్సన్, సీఈవో దృష్టికి తెచ్చారు. సమావేశంలో ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, డిప్యూటీ సీఈవో సీహెచ్ కృష్ణ, అధికారులు పాల్గొన్నారు.

బాణసంచా దుకాణాలకు అనుమతి తప్పనిసరి



నగరంపాలెం: దీపావళి పండుగ సందర్భంగా బాణసంచా తయారీ కేంద్రాలు, నిల్వ చేసే గోడౌన్లు, విక్రయించే దుకాణాలకు అనుమతి తప్పనిసరి అని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీస్, అగ్నిమాపక శాఖల నిబంధనలు, జాగ్రత్తలను విధిగా పాటించాలని అన్నారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని అన్నారు. బాణసంచా సామగ్రి తయారీ, నిల్వ కేంద్రాలు నివాసాలకు నిర్దేశించిన దూరంలో ఉండాలని పేర్కొన్నారు. అగ్ని ప్రమాదాలు జరిగితే చేపట్టాల్సిన జాగ్రత్తలపై నిర్వాహకులకు అవగాహన ఉండాలన్నారు. జనావాసాలకు, విద్యాసంస్థలు, ఆసుపత్రులకు దూరంగా బాణసంచా విక్రయాలు నిర్వహించాలని తెలిపారు. ప్రతి దుకాణం వద్ద రెండేసి చొప్పున అగ్ని నిరోధక సిలెండర్లు, బకెట్లల్లో పొడి ఇసుక, నీరు అందుబాటులో ఉండాలని చెప్పారు. లైసెన్సుల్లేకుండా మందుగుండు సామగ్రి తయారు చేసినా, నిల్వ చేసినా, విక్రయించినా చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. జిల్లాలో ఇలాంటి వాటిని తనిఖీ చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. నిబంధనల అతిక్రమణ గురించి ఏమైనా వివరాలు తెలిస్తే డయల్ 100, 112 లేదా జిల్లా పోలీస్ కంట్రోల్ రూం నెంబర్ 86888 31568కు సమాచారం అందించాలని తెలిపారు.

కేసును తప్పుదోవ పట్టిస్తే ఊరుకోం



జీజీహెచ్ ప్రాంగణంలో దళిత సంఘాల నేతలు, వివిధ పార్టీల నాయకులు

గుంటూరు మెడికల్: రౌడీ షీటర్ దాడిలో తీవ్ర గాయాలపాలై గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న సహానాను మంగళవారం జిల్లాకి చెందిన దళిత ఉద్యమ నేతలు, ఆయా పార్టీల నాయకులు పరామర్శించారు. సంఘటన గురించి బాధితురాలి తల్లిదండ్రుల ద్వారా వివరాలు అడిగి తెలుసుకున్నారు. కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం వెంటనే బాధితురాలికి మెరుగైన వైద్య సేవలు అందించాలని, నిందితుడు నవీన్‌ను పూర్తిస్థాయిలో విచారించాలని డిమాండ్ చేశారు. నిందితుడికి సహాయం చేసిన వ్యక్తులను కూడా కేసులో చేర్చాలన్నారు. కేసు తప్పుదోవ పట్టకుండా చట్టపరమైన శిక్షలు పడేలా పోలీసు దర్యాప్తు చేయాలని కోరారు. కేసును తప్పుదోవ పట్టిస్తే ఊరుకోబోమని దళిత నేతలు హెచ్చరించారు. తప్పుతోవ పట్టిస్తున్న తెనాలి రెండో పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బాషాను వెంటనే విధుల నుంచి తొలగించాలని దళిత సంఘాలు డిమాండ్ చేశాయి. పరామర్శించిన వారిలో మాల మహానాడు అధ్యక్షుడు అన్నవరపు కిషోర్, గుర్రం రామారావు, బొనిగల ప్రదీప్, మాల యువసేన అధ్యక్షుడు పొందుగల చైతన్య, వీసీకే రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్, బీఎస్పీకి చెందిన కారుమంచిలి సందీప్, బత్తుల అనిల్ , చిన్నం డేవిడ్ విలియమ్స్, నల్లపు నీలాంబరం కనకవల్లి, వినయ్, మంచాల జోసెఫ్ తదితరులు ఉన్నారు.

పాఠశాలలకు కోడిగుడ్లు సరఫరా

సాక్షి కథనానికి డీఈవో శైలజ స్పందన

సాక్షి ఎఫెక్ట్

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని సమర్థంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ పేర్కొన్నారు. మధ్యాహ్న భోజన పథకం అమల్లో నెలకొన్న లోపాలు, హైస్కూళ్లలో కోడిగుడ్లు ఇవ్వని ఘటనపై ''సాక్షి''లో ఈ నెల 20వ తేదీన 'అధ్వాన భోజనం!' శీర్షికతో ప్రచురించిన కథనానికి డీఈవో శైలజ సోమవారం స్పందించారు. హైస్కూళ్లలో కోడిగుడ్ల సరఫరాను పునరుద్ధరించామని, భోజన నాణ్యత విషయంలో పకడ్బందీగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణలో పక్కాగా పర్యవేక్షించేలా చూస్తామన్నారు.



ఈ నెల 20న 'సాక్షి'లో ప్రచురించిన కథనం

దీపావళి మందుగుండు సామగ్రి స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న బాణసంచా సామగ్రి

చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి గ్రామ పరిధిలోని గరువుపాలెంలో దీపావళి మందు గుండు సామగ్రిని అక్రమంగా తయారు చేస్తున్న వ్యక్తిని మంగళవారం చేబ్రోలు పోలీసులు అరెస్ట్ చేశారు. వడ్లమూడి గరువుపాలెంలో నేల టపాసులు తయారు చేస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందటంతో ఎస్ఐ వెంకటకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. ఇంట్లో ఇరువురు వ్యక్తులు టపాసులు తయారు చేస్తుండగా పోలీసులు రాకను గమనించి ఒక వ్యక్తి పారిపోయాడు. మరొకర్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. శేకూరు గ్రామానికి చెందిన బూరగ సైదా, అతడి స్నేహితుడు నారాకోడూరు గ్రామానికి చెందిన ముప్పవరపు సంజయ్ సారథి కలిసి కొద్ది సంవత్సరాలుగా ఇలా చేస్తున్నారని తెలిసింది. గరువుపాలెం గ్రామంలోని ఒక ఇంటిని అద్దెకు తీసుకొని అందులో పేలుడు పదార్థాలు నిల్వ చేశారు. 10 రోజులుగా ఈ ఇంటిలో నేల టపాసులు తయారు చేస్తున్నారు. కొన్ని ప్యాకెట్ల నేల టపాకాయలు, ఉపయోగించే ముడి సరుకులను స్వాధీనం చేసుకున్నారు. సైదాపై కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.. సారథిని త్వరలోనే పట్టుకుంటామని ఎస్ఐ తెలిపారు.

నమస్కారం సంస్కారం కావాలి

మాజీ ఉప రాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వెంకయ్య నాయుడు, పక్కన ఎమ్మెల్యేలు, నిర్వాహకులు

తాడికొండ: నమస్కారం సంస్కారం కావాలని మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు అన్నారు. గుంటూరు జిల్లా తాడికొండ మండలం మోతడక గ్రామంలోని కాకతీయ కన్వెన్షన్ సొసైటీలో శ్రీ నిలయం సీనియర్ సిటిజన్ కంఫర్ట్ హోం, ఫ్యామిలీ రిక్రియేషన్ సెంటర్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెద్దలను గౌరవించాలి కానీ కాళ్లకు దండం పెట్టడం సరికాదని, సంప్రదాయం ప్రకారం నమస్కారం అంటే సరిపోతుందన్నారు. గతంలో మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు కాళ్లకు సైతం అనేక మంది దండం పెట్టే వారని, ఈ విధానాన్ని ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు సైతం తిరస్కరిస్తున్నారని గుర్తుచేశారు. దేశానికి ముఖ్యమైన కుటుంబ వ్యవస్థ నేడు తగ్గిపోయిందన్నారు. ఉన్న ఊరు కన్నతల్లి లాంటిదని, దేశాన్ని, భాషను, భూమిని మరువకూడదన్నారు. బతుకుదెరువు కోసం ఇతర దేశాలకు వెళ్లినా సొంత గ్రామాన్ని మరువకూడదని కోరారు. గ్రామాభివృద్ధికి సహకారం అందించాలన్నారు. వృద్ధాశ్రమం అనే కంటే పెద్దల ఆశ్రమం అనడం మంచిదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు తెనాలి శ్రావణ్ కుమార్, మహమ్మద్ నసీర్, గల్లా మాధవి, యరపతినేని శ్రీనివాసరావు, మాజీ మంత్రి కామినేని శ్రీనివాసరావు, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, నన్నపనేని రాజకుమారి, ప్రముఖ వైద్యులు యర్రా నాగేశ్వరరావు, భాష్యం రామకృష్ణ, గంటా పున్నారావు, నంబూరు వసంత తదితరులు పాల్గొన్నారు.

యలమంచిలి శివాజీకి పరామర్శ

గుంటూరు ఎడ్యుకేషన్: నగరంలోని బృందావన్‌గార్డెన్స్‌లో రాజ్యసభ మాజీ సభ్యుడు డాక్టర్ యలమంచిలి శివాజీ ఇటీవల అనారోగ్యానికి గురై శస్త్రచికిత్స చేయించుకున్న నేపథ్యంలో మంగళవారం వెంకయ్యనాయుడు ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. కార్యక్రమంలో పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్ పాలకవర్గ అధ్యక్షుడు దేవినేని మల్లికార్జునరావు, కార్యదర్శి పాటిబండ్ల విష్ణువర్ధన్, సీనియర్ జర్నలిస్ట్ నిమ్మరాజు చలపతిరావు, సంగం డెయిరీ మాజీ చైర్మన్ కిలారి రాజన్ బాబు, స్థానిక పెద్దలు బొల్లేపల్లి సత్యనారాయణ, లంకా సూర్యనారాయణ, దాసరి హనుమంతరావు, జొన్నలగడ్డ రామారావు, అత్తోట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

బిర్యానీ హోటల్లో టీడీపీ నేత దౌర్జన్యం



షౌకత్ అలీ (ఫైల్ ఫొటో)



వేలు చూపించి వార్నింగ్ ఇస్తున్న షౌకత్ అలీ

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని పాత జాతీయ రహదారి వెంబడి పోలకంపాడు మసీదు ఎదురుగా ఉన్న బిర్యానీ పాయింట్‌లో టీడీపీకి చెందిన గల్లీ లీడర్ మంగళవారం మధ్యాహ్నం మహిళపై దౌర్జన్యానికి పాల్పడ్డాడు. సేకరించిన వివరాల ప్రకారం.. పోలకంపాడు వద్ద మసీదు ఎదురుగా ఉన్న ఆల్ మదీనా బిర్యానీ హోటల్‌లో బిర్యానీ తినేందుకు తాడేపల్లి సలాం హోటల్‌కు చెందిన టీడీపీ గల్లీ లీడర్ షౌకత్ అలీ తన స్నేహితులతో వచ్చాడు. బిర్యానీ పార్సిల్ చేయించుకున్న అనంతరం రూ.480 బిల్లు అయ్యిందని హోటల్‌లో పనిచేసే మహిళ చెప్పారు. షౌకత్ అలీ మాత్రం నేను లోకల్‌గా ఉండే టీడీపీ లీడర్‌ని. నా దగ్గర మీరు డబ్బులు తీసుకోకూడదు అంటూ మద్యం మత్తులో వీరంగం వేశాడు. సదరు మహిళ మా హోటల్ యజమానితో మాట్లాడుకోమని ఫోన్ నెంబర్ ఇస్తుండగా.. ఆమెపై బూతుల పర్వం ఎత్తుకున్నాడు. హోటల్ కూల్చి వేయిస్తా.. ఎవరు అడ్డు వస్తారో చూస్తా... అంటూ అసభ్యంగా మాట్లాడాడు. తాను హోటల్‌లో పనిచేస్తున్నానని... యజమానిని కాదని, ఏమైనా ఉంటే రేపు ఉదయం యజమాని వచ్చాక మాట్లాడుకోవాలని సదరు మహిళ చెప్పినా వినలేదు. నోటితో చెప్పడానికి వీలులేని మాటలు మాట్లాడి దౌర్జన్యానికి పాల్పడ్డాడు. హోటల్‌లో బిర్యానీ తింటున్న కొంతమంది షౌకత్ అలీ దౌర్జన్యాన్ని తీవ్రంగా ఖండించారు. చివరకు హోటల్ యజమాని సంఘటనా స్థలానికి వచ్చినా అతనిపై కూడా దౌర్జన్యం చేశాడు. హోటల్ సంగతి తేలుస్తానంటూ.. తాను ఇచ్చిన రూ.400 కూడా తీసుకుని వెళ్లిపోయాడు. షౌకత్ అలీ గతంలో కూడా వడ్డీ వ్యాపారం చేసి పలువుర్ని లైంగిక వేధింపులకు గురిచేయడంతో తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు సైతం అందాయి. అప్పట్లో సదరు మహిళలతో రాజీ కుదుర్చుకోవడంతో కేసులు నమోదు కాలేదు. జరిగిన ఈ సంఘటనపై హోటల్ యజమాని మాట్లాడుతూ.. 'వ్యాపారం చేసుకునే మాలాంటి వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారు. కేసులు గీసులు అంటూ ఎక్కడ మేం పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరగగలం? జరిగిన సంఘటనపై ఆధారాలు తీసుకుని టీడీపీ నాయకులనే కలుస్తాం. వాళ్లు చెప్పే సమాధానాన్ని బట్టి నిర్ణయం తీసుకుంటామని' తెలిపారు.

ఘనంగా శ్రీభ్రమర టౌన్‌షిప్స్ వార్షికోత్సవం



నగరంపాలెం: నిర్మాణ రంగంలో కొత్తదనం సృష్టించాలనే ఆశయంతో 2015లో శ్రీ భ్రమర టౌన్‌షిప్స్ ప్రైవేట్ లిమిటెడ్‌ను ప్రారంభించినట్లు చైర్మన్ గల్లా రామచంద్రరావు తెలిపారు. శ్రీ భ్రమర టౌన్‌షిప్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎనిమిదేళ్లు పూర్తి కాగా, తొమ్మిదో వార్షికోత్సవాన్ని మంగళవారం గుంటూరు నగరంలోని సిద్ధార్థ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించారు. వేడుకలను ప్రారంభించిన చైర్మన్ గల్లా రామచంద్రరావు మాట్లాడుతూ గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, ఎన్టీఆర్ జిల్లాలో 30కి పైగా అద్భుతమైన ప్రాజెక్ట్‌లను అభివృద్ధి చేశామన్నారు. తద్వారా స్థిరాస్తి రంగంలో తమదైన ముద్ర వేశామని పేర్కొన్నారు. ఆధునికత, అభివృద్ధి పథంలో దూసుకెళ్తున్న ప్రస్తుత సమాజంలో కష్టమర్లకు విలాసవంతమైన జీవనశైలిని అందిస్తున్నామని అన్నారు. భారత రత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం కల 'పుర'ను స్ఫూర్తి గా తీసుకున్నామని తెలిపారు. చిన్నారుల ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వేడుకల్లో సంస్థ డైరెక్టర్లు మారం చంద్రశేఖర్, ఎంఎస్.రాజు, ఎంపీకే లక్ష్మీపతి రాజు, శైలారెడ్డి కోట, యడ్లపల్లి మురళీకృష్ణ, రావెల గోపాలకృష్ణతోపాటు కాకర్ల సతీష్, కమ్మ రవి పాల్గొన్నారు.

నాలుగు మండలాల్లో వర్షం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలో సోమవారం ఉదయం నుంచి మంగళవారం ఉదయం వరకు నాలుగు మండలాల్లో వర్షం పడింది. తెనాలి మండలంలో 8.8 మిల్లీ మీటర్లు, పొన్నూరు 7.2, కొల్లిపర 6.2, కాకుమాను మండలంలో 2 మి.మీ. చొప్పున వర్షపాతం నమోదైంది.

విద్యలో ప్రతి ఒక్కరూ రాణించాలి

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి టి.లీలావతి

నగరంపాలెం: పిల్లలకు విద్య, వైద్యం, ఇతరత్రా మౌలిక సదుపాయాలు కల్పనలో రాజీపడొద్దని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి టి.లీలావతి అన్నారు. జిల్లాలో స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వం నిర్వహిస్తున్న హోమ్స్‌ను మంగళవారం ఆమె తనిఖీ చేశారు. ఏపీ హైకోర్టు ఆదేశాల మేరకు ఆయా సంస్థల్లో సోదాలు చేపట్టారు. స్వర్ణభారత్‌నగర్‌లోని దాక్షిణ్య స్పెషల్ స్కూల్ ఫర్ ఐడీ, కాకాని రోడ్‌లోని లీమా డెఫ్ అండ్ మెంటల్లీ హ్యాండీక్యాప్డ్ బాయ్స్ వెల్ఫేర్ సంస్థను, నగరంపాలెంలోని సోషల్ వెల్ఫేర్ బాలికల వసతిగృహం, సోషల్ వెల్ఫేర్ బాయ్స్ హాస్టల్ -1, సోషల్ వెల్ఫేర్ బాయ్స్ హాస్టల్ -2, జడ్పీలోని బాలికా సదన్‌ను, పరివర్తనా భవన్, గోరంట్లలోని కారామల్ సేవ సదన్‌ను సందర్శించారు. అందులోని పిల్లలకు అందిస్తున్న సదుపాయాలపై ఆరా తీశారు. పిల్లలను జాగ్రత్తగా చూడాలని అన్నారు. నాణ్యతమైన భోజనాన్ని అందించాలని చెప్పారు. చదువులో ప్రతి విద్యార్థి ముందంజలో ఉండేలా పర్యవేక్షించాలని అన్నారు.



బాలికలతో మాట్లాడుతున్న టి.లీలావతి